# శ్రీ వేపచేదు విద్యా పీఠము

# Vepachedu Educational Foundation, Inc.

## మన సంస్కృతి
## Mana Sanskriti

## బుర్రకథ

*సౌజన్య, వేపచేదు శ్రీనివాసరావు*

బుర్రకథ అనేది తెలుగువారి స్వంతమైన కథాప్రక్రియ. బుర్రకథ ద్వారా కథలను వినోదాత్మకంగా చెప్పొచ్చు. బుర్రకథని కోస్తా ఆంధ్రలో జంగంకథ అనీ; తెలంగాణాలో తంబూరాకథ అనీ, సరదాకథ అనీ; రాయలసీమ ప్రాంతాలలో తందానకథ అనీ, సుద్దులు అనీ పిలుస్తారు!

పిచ్చుగుంట్ల, జంగాలు లాంటి కొన్ని తెగలలో, ఒకే కుటూంబానికి చెందిన ఇద్దరు లేక ముగ్గురు కలిసి బుర్రకథలను చెప్పడం అన్నది ఆనవాయితీగా వస్తూంది. బుర్రకథలు చెప్పేవారిని సరదాగాళ్ళుగా పిలుస్తారు. ప్రధాన కథకుడు చేతిలో తంబూరా పట్టుకొని, కాళ్ళకు గజ్జెలు కట్టుకొని కథ చెప్తూ వుండగా; అతనికి సహాయంగా ఒకరిద్దరు డప్పులూ, డోళ్ళూ పట్టుకొని ప్రధాన కథకుడికి వంత పాడుతూ వుంటారు! ఈ వంత పాడేవాళ్ళను వంతపాటగాళ్ళు అంటారు.

కోస్తా ఆంధ్ర, తెలంగాణా, రాయలసీమ ప్రాంతాలలో చెప్పే బుర్రకథలలో కొన్ని వ్యత్యాసాలు కొట్టవచ్చినట్టు కనిపిస్తాయి! ముఖ్యమైన వ్యత్యాసము–భాష, యాస. తెలంగాణాలో బుడిగె తంబూరాను ఉపయోగిస్తే, మిగిలిన ప్రాంతాలలో పడిగె తంబూరాను ఉపయోగిస్తారు. కొందరు ఇత్తడి డప్పులను ఉపయోగిస్తే ఇంకొందరు మట్టితోచేసిన డప్పులను ఉపయోగిస్తారు. తెలంగాణా కథకులు తమ తంబూరాని చదువులతల్లి 'శారదా దేవి'గా భావిస్తారు. అందుకేవారిని 'శారదా'గాళ్ళుగా ప్రాంతీయులు పిలవడము కద్దు. తెలంగాణాలో ప్రధానకథకులు కూర్చొనీ, కోస్తా ఆంధ్రాలో నించుని బుర్రకథను చెప్తారు. రాయలసీమలో ప్రధానకథకులు చేతిలో కర్ర పెట్టుకొని కథచెప్తూవుండగా, వంతపాటగాళ్ళు తంబూరా, డప్పులను వాయిస్తూ వుంటారు!

అసలు ఈ బుర్రకథ పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకొందాము. ఇది జంగం కులంవారు నమ్ముతున్న 'కులపురాణం'. జంగంతెగకు చెందిన కులపెద్దలు నలుగురు ఒకసారి ఎలుకలను పట్టడానికి


***Copyright © 1998-2005 Vepachedu Educational Foundation, Inc. USA. All rights reserved.***
http://www.vepachedu.org

అడవికిపెళ్ళారుట. ఎలుకలకోసం నేలను తవ్వుతూండగా ఆదిదంపతులైన పార్వతీపరమేశ్వరులు వారిని చూసారుట! వారి జీవనశైలి చూసి, పార్వతీ దేవి బాధపడి, వారి జీవితాలను బాగుచెయ్యమని శివుడిని కోరిందట. కాని పరమశివుడు- పూర్వజన్మ ఖర్మను వారు అనుభవింపకతప్పదని పార్వతీదేవికి చెప్పి, ఆమె కోరికను అంగీకరించలేదట! కానీ పార్వతీదేవి తన పట్టు వదలలేదట! ఇంకతప్పక, ఆ నలుగురినీ ముందుగా పరీక్షించి, వారు ఆ పరిక్షకు నిలబడగలుగుతే తర్వాత ఆమెకోరిన వరాన్ని ఇస్తానని చెప్పాడట. ఈశ్వరుడు ఒక ముదుసలి వ్యక్తిగానూ, పార్వతీదేవి ఒక యౌవ్వనంలోవున్న సౌందర్యవతిగానూ వేషాలు మార్చుకొన్నారుట. వారిరువురూ అనలుగురు కుల పెద్దల దగ్గరకూ వెళ్ళి, తమ జీవిత విధానాన్ని మార్చుకొమ్మని హితవు పలికారుట. ఆ నలుగురూ వీళ్ళను హేళను చేసి, ముసలి వాడిని కిందకుతోసేసి, యవ్వనవతిని చెరబట్టపోయారుట! పార్వతీ దేవి కోపోద్రిక్తురాలై -వారినీ, వారితెగలవారినీ బిక్షగాళ్ళగానూ, దేశదిమ్మరులుగానూ మారిపొమ్మని శపించిందిట. ఆ శాప ప్రభావంవల్ల వారు జంగములుగామారి, దేశదిమ్మురులైపోయారని ఒక కులపురాణం వుంది.

పన్నెండవ శతాబ్ధంలో కర్ణాటకకు చెందిన బసవులచే ప్రభావితులై, జంగమ తెగ వారు వీరశైవమతంను అవలంబించారు. మనుగడసాగించడానికి, శివునిగాధలను బుర్రకధలుగా చెప్పుకొంటూ, దేశాటన చేస్కొంటూ బ్రతకడం మొదలుపెట్టారు. ఆవిధంగా 'జంగమ' అనేపదం శివభక్తులకు పర్యాయపదంగా మారింది. జంగమ అంటే శివలింగధారులని కూడా వ్యవహారిక అర్ధం వుంది. జంగం తెగలో విభిన్నమయిన ఉపతెగలుకూడా వున్నాయి. బుడిగెజంగం, బెడజంగం, మాలజంగం, మాదిగజంగం, ఊరజంగం, గానయతజంగం, శివజంగం, ఈతముక్కలజంగం, పిరికిజంగం మొదలైనవి ముఖ్యమైనవి. ఇప్పటికీ జంగమ దేవరలు వీరశైవమాతాన్నే అవలంబిస్తున్నారు.

భారత స్వాతంత్ర్య సమర కాలంలో బుర్రకధ ఆంధ్రప్రదేశ్ లో పునర్వైభవాన్ని చవి చూసింది. బుర్రకధలు ప్రజలను రెచ్చగొట్టేవిగావున్నాయనీ, విప్లవపంథాని ప్రభోధిస్తున్నాయనీ- అప్పట్లో మద్రాసులో బ్రిటిష్ ప్రభుత్వమూ, హైదరాబాదులో నిజాం ప్రభుత్వమూ బుర్రకధలను నిషేదించాయి! పెండ్యాల వెంకటేశ్వరరావు, పరుచూరి రామకోటయ్య, సిరివిసెట్టి సుబ్బారావు, కోసూరి పున్నయ్య, గోవర్ధన, కాకుమాను



***Copyright © 1998-2005 Vepachedu Educational Foundation, Inc. USA. All rights reserved.***

# శ్రీ వేపచేదు విద్యా పీఠము

# Vepachedu Educational Foundation, Inc.

## మన సంస్కృతి

## Mana Sanskriti

సుబ్బారావు, దవులూరు, చింతలాల్ సూర్యనారాయణ, మోటూరి ఉదయం, చింతల కోటేశ్వరమ్మ, మహంకాళి లక్ష్మి మొదలైన వారు బుర్రకథాప్రక్రియలో పేరుగాంచారు!

ప్రామాణిక ఆంగ్లమూల రచన : మన సంస్కృతి, వేపచేదు శ్రీనివాసరావు

(http://www.vepachedu.org/burrakatha.htm)

*One World One Family*
***Copyright © 1998-2005 Vepachedu Educational Foundation, Inc. USA. All rights reserved.***
http://www.vepachedu.org